క్లుప్తంగా

అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు నిధులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: నాడు – నేడులో భాగంగా మండలంలోని 67 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరైనట్టు ఎంపీడీఓ కె.గీతాంజలి తెలిపారు. స్థానిక ఎంఎంఎస్ భవనంలో ఐసీడీఎస్, ఇంజినీరింగ్ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీలైనంత తొందరగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు రిజిస్టర్‌ను పూర్తి చేయాలి : పీఓ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: బీఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న వారు రిజిస్టర్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. బీఎల్‌ఓలతో ఆమె బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఓటు తొలగించేటప్పుడు నిబంధన ప్రకారం తొలగించాలన్నారు. వలస వెళ్లిన వారి ఓట్ల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర బ్రహ్మ సాక్షిగా దీక్ష విరమణ



అక్షరబ్రహ్మ మతార్భన్ ప్రచారకుల హోమాధికాలు నిర్వహణ

భామిని: ఆదివాసీ గిరిజనుల దైవం అక్షర బ్రహ్మ సమక్షంలో బుధవారం హోమాధికాలు నిర్వహించి ఆదివాసీలు కార్తీక దీక్షలు విరమించారు. భామిని మండలం నూకాలమ్మ మెట్టపై గల అక్షరబ్రహ్మ ఆలయంలో జిల్లా కోఆర్డినేటర్ సవర కరువయ్య ఆధ్వర్యంలో దీక్షలు విరమణ చేసి కంకణ నిమజ్జనం చేశారు.తులసీ చెట్టు వద్ద 21 రోజుల కార్తీక దీక్షలోని ఆదివాసీ మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. అక్షర బ్రహ్మ మతార్భన్ ప్రచారకులు పవిత్ర మంత్రాల మధ్య సవర భాష అక్షర సృష్టికర్త సవర పండిట్ మంగై సవర గుమాంగో చిత్రపటాలకు పూజలు చేసి హోమాధికాలు నిర్వహించారు. భామిని, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా ప్రాంతాల నుంచి ఆదివాసీ దీక్షాపరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ సుందరీకరణకు తొలి ప్రాధ్యానం ఇస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పట్టణ ప్రధాన రహదారిలోని డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణకు ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటామన్నారు. డివైడర్‌పై జింక్ రెయిలింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించామని చెప్పారు. పట్టణ సుందరీకరణ ధ్యేయంగా చర్యలు చేపట్టామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ రూపురేఖలు పూర్తిగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోనుగౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, కౌన్సిలర్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన శంకుస్థాపన చేసి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



సభావేదికపై ఆనందోత్సాహలతో ఎమ్మెల్యే పుష్పశ్రీ వాణి వైఎస్సార్‌సీపీ మహిళా ప్రజాప్రతినిధులు



బస్సుయాత్రతో పాటు బైక్ ర్యాలీతో వస్తున్న అభిమానులు

ఉప్పొంగిన ఉత్సాహం.. జై కొట్టిన గిరిజనం

వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు గిరిజనం జైకొట్టారు. కురుపాంలో బుధవారం జరిగిన యాత్రకు మన్యం జిల్లా గిరిజనం వేలాదిగా తరలివచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మన్యం జిల్లాకు చేసిన మేలును గుర్తు చేసుకుంటూ జనం.. ప్రభంజనంలా.. కదిలారు. కురుపాం వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. బహిరంగ సభ జరిగిన ప్రాంతమంతా జగన్ నినాదంతో హోరెత్తింది. జై జగన్... మళ్లీ.. మళ్లీ.. జగనే సీఎం కావాలంటూ నినదించారు. పిల్లా పాపల నుంచి ముదసలి వరకు యాత్రకు తరలి రావడంతో మన్యం దారులన్నీ కురుపాం వైపే దారితీసాయి.

–సాక్షి నెట్‌వర్క్



సభావేదికపై ఆనందోత్సాహలతో నృత్యం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



మేడెక్కిన అభిమానం

సమస్యల పరిష్కారానికి సమ్మె బాట



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అమరవేణి

పాలకొండ రూరల్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8 నుంచి సమ్మెకు సిద్ధం అవుతున్నట్టు ఆ సంఘ నాయకురాలు బి.అమరవేణి వెల్లడించారు. స్థానికంగా రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమీప రాష్ట్రాల్లో మాదిరి జీతాలు పెంచాలని, తమపై రాజకీయ ఒత్తిడి తప్పించాలని, గ్రాట్యుటీ అందించాలని కోరారు. వీటితో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇదివరకే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటం జరిగందన్నారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాలు, అంగన్‌వాడీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒడిశాకు తరలిన ఏనుగుల గుంపు



ఆల్ ఒడిశా రోడ్డు దాటుతున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలో సంచరిస్తూ ఆందోళన కలిగించిన ఏనుగుల గుంపు బుధవారం వంశధార నది ఆవల గల ఒడిశాలోని కాశీనగర్ సమీపంలోకి చేరింది. నది ఆవల గల ఒడిశాలోని భూపతి లక్ష్మీపురం నుంచి హరిపురం మీదుగా నాలుగు ఏనుగుల గుంపు ఆల్ ఒడిశా రోడ్డును దాటుతూ తరలివెళ్లాయి. రోడ్డు దాటుతుండగా ప్రయాణికులు వాహనాలను నిలిపివేసి ఆసక్తిగా తిలకించారు.

మెరుగైన బోధన అందించాలి



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ సోంబాబు, డీఆర్పీలు

పాలకొండ రూరల్: విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగపర్చుకోవాలని ఎంఈఓ కె.సోంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా విధానంలో భాగంగా 4వ సముదాయ సమావేశం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మీసాల సూర్యనారాయణ పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు డీఆర్పీలు టి.సూర్యనారాయణ, టి.యోగేష్‌కుమార్, నారాయణరావు, కె.జనార్ధనరావు శిక్షణ అందించారు. సాంకేతిక బోధన విధానాలపై అవగాహన కల్పించారు.

ఫిష్ ఆంధ్రా షాపులతో ఆర్థికాభివృద్ధి



చేపలను విక్రయిస్తున్న షాపు నిర్వాహకులు

గరుగుబిల్లి: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే గ్రామాల్లో ఫిష్ ఆంధ్రా షాపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య అన్నారు. మండల కేంద్రంలో ఫిష్ ఆంధ్రా షాపును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు నిర్వాహకులు నియమ నిబంధనలను పాటించాలన్నారు. ప్రతీ రోజు షాపును తెరవడంతో పాటు తాజా చేపలను విక్రయించాలన్నారు. ఫిష్ ఆంధ్రా షాపు నిర్మాణానికి, ఫర్నీచర్‌కు ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తుందన్నారు. మత్స్యకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వై.శ్రీదేవి, జిల్లా మత్స్యశాఖ వైస్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణరావు, నాయకులు ఆర్.రామినాయుడు, ఎస్.శ్రీరాముల నాయుడు, ఎస్.తిరుపతిరావు, టి.శ్రీరాములు, త్రినాథ్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల బడ్జెట్‌కు ఆమోదం



బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి

సీతానగరం: మండల పరిషత్ 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 అంచనా బడ్జెట్‌ను మండల సమావేశంలో సభ్యులు బుధవారం ఆమోదించారు. ఎంపీపీ బలగ రమణమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి మండల సభ్యులతో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సభాధ్యక్షురాలు బి.రమణమ్మ సూచనలమేరకు ఎంపీడీఓ బి కృష్ణ మహేష్‌రెడ్డి 2023–24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్‌లో రాబడులు, ఖర్చులు నిర్ధారించి ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలియజేసింది. అలాగే 2024–25 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, వైఎంపీపీ టి.సూర్యనారాయణ, పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర కృషితో గిరిశిఖర గ్రామాలకు రహదారి నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయని తోణాం సర్పంచ్ ముర్రల ఆదయ్య అన్నారు. సుమారు 8 కోట్ల రుపాయలతో పీఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా తోణాం – కుడకారుకు నిర్మించనున్న రహదారికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆదయ్య మాట్లాడుతూ, ఈ రోడ్డు వల్ల చాలా గిరిజన గ్రామాల ప్రజలకు రాకపోకలకు వలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా నిధులు ఖర్చు చేయాలి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం కింద తెర్లాం మండలానికి మంజూరు చేసిన ఫేజ్–2 నిధులను సక్రమంగా వినియోగించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నాడు–నేడు ఫేజ్–2 కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.

నాడు – నేడు ఫేజ్ 2 పనులపై అవగాహన



పనులపై ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయగౌరి

జియ్యమ్మవలస : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి కె.విజయగౌరి ఆధ్వర్యంలో బుధవారం ఓరియెంటేషన్ కార్యక్రమం బుధవారం జరిగింది. నాడు – నేడు ఫేజ్ 2 భవనాల మరమ్మతులపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు సంబంధించిన మదర్స్ కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్స్, 2–3 సంవత్సరాలలోపు పిల్లల తల్లిందండ్రులు, కార్యకర్తలు, కురుపాం ఎంఈఓ సత్యనారారాయణ, జియ్యమ్మవలస ఎంఈఓ – 2 శ్రీనివాసరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పాలకొండ: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు బుధవారం తెలిపారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ లావణ్య

గరుగుబిల్లి: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఎస్.లావణ్య అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను ఆమె బుధవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సచివాలయానికి జగనన్న ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు నిర్మాణాలపై అవగాహన కల్పించాలన్నారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, కాలువలను నిర్మాణం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ:

అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు గురువారం అవగాహన కల్పించారు. స్థానిక బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రమాద సమయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. భవనాల్లో మెట్లు, లిఫ్టులు పని చేయని సందర్భాల్లో బాధితులను భవనాల నుంచి కిందకు ఎలా తీసుకురావాలన్న విదానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సోంబాబు, హెచ్ఎం జి.రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్టు ఎస్ఎఫ్ఐ పాలకొండ నియోజకవర్గ అధ్యక్షుడు టి.అఖిల్ అన్నారు. పట్టణంలో పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులతో బుధవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో 70వేల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం అమలు ఎక్కడని ప్రశ్నించారు. ఈ క్రమంలో తాము చేపడుతున్న పోరాటాలపై విద్యార్థులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాల్సిన పలు కార్యక్రమాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా పోస్టుమెట్రిక్ వసతిగృహం వద్ద వాల్‌పోస్టర్లు విడుదల చేశారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం పలుచోట్ల జరిగింది. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. దీన్ని గుర్తించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: బెజ్జి సచివాలయ పరిధిలో జగనన్న ఆవశ్యకతను వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎంపీపీ భాను, సర్పంచులు శ్రీనివాసరావు, జనార్ధనరావు తదితరులు



భామిని: బత్తిలి-1 సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు తోట సింహాచలం, విశ్వనాథపట్నాయిక్, వమ్మరవిల్లి రమేష్



సీతంపేట: కీసరజోడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ



వీరఘట్టం: కంబరలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ దమలపాటి

అద్దెకు ఐటీడీఏ షాపులు

సీతంపేట: స్థానిక సామాజిక భవనం ఎదురుగా నూతనంగా నిర్మించిన ఐటీడీఏ షాపులు అద్దెకు గిరిజన అభ్యర్థులకు ఇవ్వనున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. నెలసరి అద్దె రూ.4,500లు, గుడ్‌విల్ రూ.2లక్షలు డిపాజిట్ కట్టాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల 6వ తేదీ లోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు.